## పోలీసు అధికారులకు
# షోకాజ్ నోటీసులు!

**• సివిల్ వివాదాల్లో తలదూర్చినందుకు..**

**• బాధితులను ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలు**

గద్వాల అర్బన్, మార్చి 30: ఓ వ్యవసాయ భూమి వ్యవహారంలో ఇద్దరు పోలీస్ అధికారులు తల దూర్చిన వివాదంపై కోర్టు నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. పూర్తి వివరాలు ఇలా.. కేటీదొడ్డి మండలంలోని మల్లాపురంలో ఓ వ్యవసాయ భూమిని కొందరు వ్యక్తులు విక్రయించిన వ్యవహారంపై పెద్ద మొత్తంలో ఆరోపణలు రావడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్లాపురం గ్రామానికి చెందిన మౌలయ్యనాయుడు తనకు సంబంధించి 6.18 గుంటల భూమిని కుర్వ మహబూబ్‌కు సంబంధించి కొందరు వ్యక్తులు సర్వే నెంబర్ ఒకటి చూయించి భూమిని మరొక చోట రామకృష్ణ అనే వ్యక్తికి భూమిని విక్రయించగా.. ఆయన నుంచి బడే సాడ్ అనే వ్యక్తి పొందాడు. ఈ క్రమంలో మౌలయ్యనాయుడు తనకు సంబంధించిన పొలంలో ఇతర వ్యక్తులకు సంబంధం ఏంటని 2019 సంవత్సరంలో కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌తోపాటు కోర్టును ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో 2019లో ఈ కేసుకు సంబంధించి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల అనంతరం రాజీకుదిర్చి సమస్యను పరిష్కరించినట్లు సమాచారం. కాగా ఈ క్రమంలో కొందరు వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి పోలీసుల సహకారంతో కోర్టు ఆదేశాలను ధిక్కరించి భూమి కుర్వ మహబూబ్ ఆయన నుంచి కొనుగోలు చేసిన రామకృష్ణ, బడే సాబ్‌దే అంటూ 2020, 2022 సంవత్సరంలో పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ నిర్వహించి మౌలయ్య నాయుడుపై అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తనకు జరిగిన అన్యాయంపై మౌలయ్యనాయుడు కోర్టును ఆశ్రయించి సివిల్ వ్యవహారంలో అనవసరంగా తలదూర్చిన కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో గతంలో విధులు నిర్వహించిన బాలవెంకటరమణ, కుర్మయ్యపై చర్యలు తీసుకోవాలని కోర్టును విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. తనకు సంబంధించి భూమి వ్యవహారంలో పోలీస్ అధికారులు కుర్వ మహబూబ్‌తో చేతులు కలిపి తనను మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు కోర్టులో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మౌలయ్యనాయుడు వాదనల అనంతరం సివిల్ వ్యవహారంలో అనవసరంగా తలదూర్చిన బాలవెంకటరమణ, కుర్మయ్యతోపాటు డీజీపీ కార్యాలయానికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అలాగే గతంలో ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి నివేదికను కోర్టుకు హాజరుపర్చాలని ప్రస్తుత పోలీస్‌స్టేషన్ ఎస్సై కూడా ఓ నోటీస్‌ను పంపినట్లు సమాచారం. ఈ క్రమంలో అనవసరంగా సివిల్ వ్యవహారంలో తలదూర్చిన ఇద్దరు పోలీస్ అధికారులపై ఉన్నత పోలీస్ అధికారులు కూడా దృష్టిసారించి విచారణ చేపట్టేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.

## అడిషనల్ కలెక్టర్‌గా ఎంపికైన
# మండ్ల పవన్‌కుమార్

కొత్తకోట, మార్చి30 : తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో వనపర్తి జిల్లా కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పుష్పలత వెంకటస్వామి కుమారుడు మండ్ల పవన్ కుమార్ 510 మార్కులు సాధించాడు. నేడు ప్రకటించిన ర్యాంకుల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు బీసీ-ఏ గ్రూప్‌లో 2వ ర్యాంకు సాధించి అడిషనల్ కలెక్టర్‌గా నియమించబడ్డారు.

# ఎన్నాళ్లీ నడ(ర)క యాతన

**• తరాలు మారిన మారని విద్యార్థుల తలరాతలు**

**• చదువుల తల్లి ఒడికి చేరుకోవాలంటే తప్పని కాలినడక**

నారాయణపేటరూరల్, మార్చి 30: తరాలు మారిన విద్యార్థుల తలరాతలు మాత్రం మారడం లేదు.అందుకు నిదర్శనం నారాయణపేట మండలం గనిమోనిబండ గ్రామానికి చెందిన విద్యార్థుల సమస్యలే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులు పై చదువుల కోసం వెళ్లాలంటే ప్రతిరోజూ 14 కిలో మీటర్లు కాలినడకలో వెళ్లాల్సిందే. గ్రామంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకొన్న విద్యార్థులు ప్రతి ఏడాది 30 నుంచి 40మంది వరకు గనిమోనిబండ నుంచి 6,7వ తరగతులు చదివేందుకు పక్క గ్రామం అభంగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు రానుపోను 7కిలో మీటర్లు కాలినడకతో ప్రయాణం సాగిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు ఉన్నత విద్య కోసం గనిమోనిబండ నుంచి 7కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటకొండకు కాలినడకన ప్రయాణం సాగిస్తున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు రాకపోకల కోసం మొత్తం 14కిలో మీటర్లు నడిస్తే తప్పా.. ఉన్నత విద్యను అందుకోలేమని ఇటు విద్యార్థులు అటు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రధానంగా గనిమోనిబండ నుంచి అభంగాపూర్‌కు బీటీరోడ్డు సౌకర్యం లేకపోవడం, అభంగాపూర్ నుంచి కోటకొండ వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడమే విద్యార్థులకు శాపమైంది. ఓ పక్క నిత్యం కాలినడక మరో పక్క విద్యార్థుల భుజానికి పుస్తకాల మోతతో కుస్తీ పడుతున్నారు. గనిమోనిబండ విద్యార్థులు, గ్రామస్తుల సమస్యను స్వయంగా తెలుసుకొన్న అప్పటి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి గ్రామానికి రూ.2 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేయించగా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. ఇదే క్రమంలో గత ఎన్నికల సందర్భంగా గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హామీ ఇచ్చారు. కాగా ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినప్పటికీ రోడ్డు సౌకర్యంతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల నేరవేరక పోవడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పాఠశాల సమయాల్లో నడిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

అభంగాపూర్ నుంచి కోటకొండకు నడుచుకుంటూ వస్తున్న గనిమోనిబండ విద్యార్థులు

గతంలో మంజూరైన రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

**త్వరగా అలిసిపోతున్నాం..**

ప్రతి రోజూ పాఠశాలకు బ్యాగులు వేసుకొని నడుచుకొంటూ వెళ్తుంటే సాయంత్రం ఇంటికి రాగానే భుజాలు నొప్పెడుతున్నాయి. రోజూ త్వరగా లేచి పాఠశాలకు ముందుగానే బయలుదేరాలి. ఇంట్లో ఏ మాత్రం వంట లేకపోతేనా చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. తోటి స్నేహితులంతా వెళ్లిపోతారు. నడుచుకొంటూ ఒంటరిగా ఎలా వెళ్లాలి. వానకాలం అయితే మా బాధలు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామానికి రోడ్డు వేసి మా ఇబ్బందులు తీర్చాలి.

**- భీమమ్మ, విద్యార్థిని, గనిమోనిబండ**

**భుజాలు నొప్పి పెడుతున్నాయి**

ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు సుమారుగా 14కిలోమీటర్లు నడవాల్సి రావడంతో ఇంటికి వచ్చిన వెంటనే చాలా తొందరగా అలసిపోతున్నాం. ఇంట్లో ఏమైనా పనులు చేయ్యాలన్నా చేయలేకపోతున్నాం. ఇప్పుడు ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. మిట్ట మధ్యాహ్నం మండుటెండలో గ్రామానికి నడుచుకొంటూ వెళ్లాలంటే మా ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.. ఇప్పటికైనా మా ఊరికి బీటీ రోడ్డు వేయించి బస్సు సౌకర్యం కల్పించాలి.

**- బుగ్గమ్మ, విద్యార్థిని గనిమోనిబండ**

# కనిపించినకాడల్లా కబ్జా!

**• మెట్లబావులను పూడుస్తున్న వైనం • ఆక్రమణకు గురవుతున్న చారిత్రక కట్టడాలు**

**• అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు • పట్టించుకోని పురావస్తు శాఖ**

గద్వాలటౌన్, మార్చి 30: గద్వాల సంస్థానం తెలంగాణ రాష్ట్రంలో గొప్పది.. సంస్థానాదీశుల కాలంలో ఎన్నో అపురూప కట్టడాలు.. ఆలయాలు.. శిల్పసంపద.. కళలకు.. కళాకారులకు పెట్టింది పేరు. నాటి చరిత్రను తెలుపుతూ ఇప్పటికీ కొన్ని అపురూప కట్టడాలు దర్శనమిస్తున్నాయి. అందులో మెట్లబావులు ఎంతో ప్రధానమైనవి. నాటి కాలంలో ప్రజలు, పశువుల దాహార్తి తీర్చడమే కాకుండా పంటపొలాలను నీరందించిన మెట్లబావులు ప్రస్తుత కాలం వారికి ఎందుకు పనికి రాని నీటి గుంతల్లా కనిపిస్తున్నాయి. అందుకేనేమో కనిపించిన కాడల్లా అక్రమిస్తూ బావులను పూడ్చి వారి ఖాతాలో వేసుకుంటున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు సైతం వారికి అండగా ఉండడం ఎంతో గొప్ప విషయనే చెప్పక తప్పదు. ఇక పురావస్తు శాఖ పేరుకు తగ్గట్టుగా పురాణాల్లో కలసిపోయేందేమో అన్న అనుమానం తలెత్తుతుంది. ఎందుకంటే గత కొన్నిరోజులుగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న కొత్త మెట్లబావిని కాపాడాలంటూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు గళమెత్తుతున్నా ఇటు అధికారులు, అటు పాలకులు స్పందించిన పాపాన పోలేదు.

**చరిత్రకు ఆనవాళ్లుగా మెట్లబావులు**

సంస్థానాల కాలంలో అనేక మెట్ల బావులు తవ్వించారు. వాటిలో ప్రధానమైనవి చొక్కం బావి, లింగంబావి ప్రస్తుతం ఈ రెండు బావులు పునరుద్ధరించబడి వాడుకలో ఉన్నాయి. అలాగే ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ముందున్న మెట్ల బావి, నదీఅగ్రహారం వెళ్లేమార్గాన ఉన్న మరో మెట్లబావి కూడా ఎంతో ప్రత్యేకమైనవి. నాలుగు బావులు కూడా ప్రజలకు తాగు, సాగునీరందిచేవి. అంతేకాక బావుల్లో శివాలయాల్లో ఉన్నాయి. ఈ ఆలయాల్లో నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగేవి. పట్టణీకరణ జోరందుకోవడంతో బావులన పూర్తిగా విస్మరించారు. దీంతో బావులు ఎందుకు పనిరాకుండా పోయాయి. మున్సిపాలిటీ వెనుకబాగాన ఉన్న లింగంబావిని, ముందు బాగాన ఉన్న చొక్కంబావిని కొన్ని సంవత్సరాల క్రితం వాడుకలోకి తెచ్చారు. మిగతా రెండు బావులను పట్టించుకోక పోవడంతో వాటిలో ఒకటైన కొత్తబావిని మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్ తనఖాతాలో వేసుకునేందుకు శ్రీకారం చుట్టాడు. బావి తనదేనంటూ పూడ్చివేతకు పూనుకున్నాడు.

మట్టితో పూడ్చక ముందు కొత్తబావి

పూర్తిగా మట్టితో పూడ్చేసిన కొత్తబావి

**వ్యతిరేకిస్తున్న పార్టీలు, సంఘాలు**

చరిత్ర ఉన్న మెట్లబావులను కాపాడి భవిష్యత్ తరాలకు నాటి కళానైపుణ్యాన్ని, చరిత్రను అందించాల్సిన అవసరం ఉందని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గళమెత్తుతున్నారు. కబ్జాదారుల నుంచి చారిత్రాత్మక కట్టడాలను సంరక్షించాలని ధర్నాలు, నిరసనలు చేపట్టారు. కబ్జాదారులు, పాలకులు, పురావస్తుశాఖ, ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన ఇప్పటి వరకు రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చారిత్రాత్మక కట్టడాలను కాపాడేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

# ధనజడి

## ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో
# పన్ను లాభం

**తపాలా** శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీములో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం-1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)**

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్‌సీ)**

ఎన్ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)**

ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

**సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్)**

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్‌ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

**ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)**

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపు లుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.

# గోల్డ్ Vs నిఫ్టీ 50

## దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి-మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టింది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

**ఇదీ సంగతి..**

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

**దీర్ఘకాల రాబడులు**

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8-10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12-15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

**ద్రవ్యోల్బణం సవాళ్లు**

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

**ఒడిదుడుకులు**

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

**ద్రవ్య లభ్యత**

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

**పోర్ట్‌ఫోలియో**

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

**చివరగా..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!

మార్కెట్ పల్స్

**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800-24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

***గమనిక..***

***స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.***

## ఆరోగ్య బీమా..
# ఓ స్మార్ట్ పెట్టుబడి




**నేడు** వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరిక లకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె-కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.